# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
పేజీలు 12

గురువారం, 24 అక్టోబర్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## జీవన్‌రెడ్డి అలక.. స్పందించిన శ్రీధర్‌బాబు



**హైదరాబాద్:** జగిత్యాల సీనియర్ కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి వ్యవహారంపై మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం(అక్టోబర్ 23) స్పందించారు. జగిత్యాలలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి మర్డర్‌పై సీరియస్‌గా ఉన్నామన్నారు. మర్డర్ ఎవరు చేసినా ఎవరు చేయించినా వదిలేది లేదన్నారు. జిల్లా ఎస్పీతో ఈ విషయమై ఇప్పటికే మాట్లాడామన్నారు.

## రాష్ట్రంలో రెండ్రోజులు వర్షాలు!

### నిపుణుల సూచన... బంగాళాఖాతంలో తుపాను ప్రభావం

**హైదరాబాద్:** తూర్పు-మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బుధవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో తుపానుగా మారింది. ఇది పారదీప్ (ఒడిశా)కు ఆగ్నేయ దిశగా సుమారు 560 కిలోమీటర్ల దూరంలో కొనసాగుతోంది. వాయువ్య దిశగా కదులుతూ గురువారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

## వారం రోజుల్లో క్షమాపణ చెప్పాలి..

బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీస్

నిరాధార వ్యాఖ్యలతో పరువుకు భంగం

వారంలో క్షమాపణ చెప్పాలి

లేదంటే న్యాయపరంగా చర్యలు



2లో

## నేను నోటీసులతోనే బదులిస్తా

భయపెట్టాలని చూస్తే భయపడతామా?

కేటీఆర్ సుద్దపూసేమీ కాదు: బండి సంజయ్

కేసీఆర్, కేటీఆర్ ఆరోపణలు చేస్తే రాజకీయం



2లో

## పరువు నష్టం కేసులో మంత్రి సురేఖ రిప్లై


సినీనటుడు నాగార్జున వేసిన పరువునష్టం దావాపై...

సురేఖ తరఫున అడ్వకేట్ జడ్జికి అందజేత



2లో

# ఇంచియాన్ స్మార్ట్ సిటీ తరహాలో...



- నగరాన్ని సందర్శించిన మంత్రుల బృందం
- ఇంచియాన్‌లో అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో అభివృద్ధి
- పునరుత్పాదక విద్యుత్తు, పునర్వినియోగ
- నీటి పద్ధతులు, కాలుష్య రహిత విధానాలు
- వీటినే ఫోర్త్‌సిటీకి అనుసరించే యోచన
- హైదరాబాద్, జిల్లా కేంద్రాల్లోనూ స్మార్ట్ సేవలు
- కొరియా స్పోర్ట్స్ వర్సిటీతో త్వరలో ఒప్పందం
- క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు సహకారం

**సియోల్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక నగరంగా నిర్మించనున్న ఫోర్త్‌సిటీకి స్మార్ట్ సొబగులు అద్దాలని యోచిస్తోంది. కాలుష్యరహిత విధానాలు అనుసరిస్తూ.. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో అభివృద్ధి చేసే యోచనలో ఉంది. ఇందుకోసం సియోల్‌కు 30 కిలోమీటర్ల దూరంలో స్మార్ట్ సిటీగా ఉన్న ఇంచియాన్ నగరంలో అమలు చేస్తున్న విధానాలను ఫోర్త్‌సిటీలో అనుసరించాలని భావిస్తోంది. ఈ మేరకు.. సియోల్ పర్యటనలో ఉన్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని బృందం బుధవారం ఇంచియాన్ స్మార్ట్ సిటీని, అందులో భాగంగా ఉన్న చియోంగ్న, సాంగడో, ఇయాంగ్జాంగ్ ప్రాంతాలను సందర్శించింది. అక్కడి అధికారులతో చర్చలు జరిపింది. ఇంచియాన్ నగరంలో పునరుత్పాదక విద్యుత్తు, పునర్వినియోగ నీటి పద్ధతులు, పవన, సోలార్ విద్యుత్తు వ్యవస్థలు, ఇళ్లలో ఏసీ, ఉష్ణోగ్రతల నిర్వహణ, సెక్యూరిటీ, విద్యుత్తు సరఫరా నియంత్రణ తదితర సేవలను సాంకేతికత సహాయంతో అందిస్తున్న తీరును అడిగి తెలుసుకుంది. తక్కువ భూభాగంలోనే ఈ నగరాలను అభివృద్ధి చేస్తున్నారని, ఇంతకంటే ఎక్కువ స్థలం ఉన్న ఫోర్త్‌సిటీని అన్ని హంగులతో నిర్మించవచ్చనే అభిప్రాయానికి వచ్చింది.

**ఇంచియాన్‌లో స్మార్ట్‌గా సేవలు..**

ఇంచియాన్ స్మార్ట్ సిటీలో ప్రజలకు అవసరమయ్యే అన్ని సేవలు దాదాపు ఆన్‌లైన్‌లోనే అందుతున్నాయి. ఐటీ, ఐవోటీలను ఉపయోగించి మొత్తం స్మార్ట్ సేవలకు శ్రీకారం చుట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, రక్షణ వ్యవస్థల నిర్వహణతోపాటు చలికాలం ఇళ్లలోని ఏసీల ద్వారా వేడి రావడం, వేసవిలో చల్లగాలి వచ్చేలా నియంత్రిం చడం వరకు అంతా స్మార్ట్‌గా అందిస్తున్నారు. అంతేకాదు.. దక్షిణ కొరియాలోనే మొట్టమొదటి ఫ్రీ ఎకనామిక్ జోన్ (ఎఫ్ఈజడ్) కూడా ఇక్కడే ఏర్పాటైంది. ఈ నగర అభివృద్ధికి ప్రైవేటు సంస్థలు కూడా ముందుకొచ్చాయి. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో అభివృద్ధి - మిగతా 2వ పేజీలో

## ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలతాయి!

ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి సహా 10 అంశాల్లో చర్యలు

ప్రధాన నేతలకు షాక్ తప్పదు పూర్తి ఆధారాలతో ఫైళ్లు సిద్ధం

తప్పు చేసింది ఎవరైనా విడిచిపెట్టం: పొంగులేటి



**హైదరాబాద్, అక్టోబరు 23:** దీపావళికి ముందే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజకీయ బాంబు పేల్చారు. దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో హాన్ నది పునరుజ్జీవనంపై అధ్యయనానికి వెళ్లిన పొంగులేటి అక్కడ ఓ తెలుగు చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని..

## సీఐపై పోక్సో కేసు.. ఖాకీ చొక్కాతో నీచ పనులు

బాలికపై సీఐ అత్యాచారయత్నం

చాక్లెట్ ఇస్తానని ఆశచూపి దుర్మార్గం

హనుమకొండలో ఘటన..

బయటకు పొక్కకుండా పోలీసుల తీవ్ర యత్నాలు



**కాజీపేట, అక్టోబరు 23:** బడి నుంచి వచ్చిన బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశచూపి ఓ సీఐ (వేకెన్సీ రిజర్వ్-వీఆర్) ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. హనుమకొండలో ఈ ఘోరం వెలుగుచూసింది. ఈ ఘటనపై బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినా పోలీసులు, ఉన్నతాధికారులు సదరు సీఐను కాపాడేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయితే ఎట్టకేలకు నిందితుడిపై కాజీపేట పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో - మిగతా 2వ పేజీలో

# ‘గో బ్యాక్ అంబుజా’..

సిమెంట్ ఫ్యాక్టరీ మాకొద్దు..

నిరసనల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ

యాదాద్రి జిల్లా రామన్నపేటలో ఉద్రిక్తత

తరలివచ్చిన పరిసర గ్రామాల రైతులు

అదనపు కలెక్టర్‌ను అడ్డుకున్న జనం



**యాదాద్రి/నల్లగొండ, అక్టోబరు 23:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమను నెలకొల్పవద్దంటూ ప్రజలు ముక్తకంఠంతో స్పష్టంచేశారు. 63.8 ఎకరాల్లో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో బుధవారం రామన్నపేటలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రజల ఆందోళన, వారిని నిలువరించేందుకు పోలీసుల ప్రయత్నంతో ఉద్రిక్తత ఏర్పడింది. తమ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని, ‘అంబుజా గో బ్యాక్’ అంటూ ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సమీపంలోని 10 గ్రామాల నుంచి యువకులు, మహిళలు, రైతులు ట్రాక్టర్లు, మోటారుసైకిళ్లపై తరలివచ్చి నిరసన తెలిపారు. కాలుష్యకారక సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే చేతి, కుల వృత్తులు, వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. సదస్సుకు - మిగతా 2వ పేజీలో

## ఐఏఎస్ ఆఫీసర్ అమోయ్ కుమార్‌ను సుదీర్ఘంగా విచారించిన ఈడీ

భూముల కేటాయింపుపై ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను

7 గంటలపాటు విచారించిన ఈడీ ప్రత్యేక బృందం

నేడు మరోసారి విచారణకు రావాలని ఆదేశాలు



2లో

గత ప్రభుత్వంలోని కీలక నేతల మెడకు ఈడీ ఉచ్చు?

వారికీ నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం

## ఆ మాటలు నా నోటితో నేను చెప్పలేను

సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం..

రాతపూర్వకంగా మీ ముందు పెట్టాను

నా పరువు, ప్రతిష్ఠలను మంటగలిపారు

కోర్టులో బీఆర్ఎస్ నేత కేటీఆర్ వాంగ్మూలం

దాసోజు శ్రవణ్‌కుమార్ సాక్ష్యం నమోదు

30న మిగతా సాక్షుల స్టేట్‌మెంట్ రికార్డు



2లో

## ధాన్యం మిల్లింగ్ చార్జీలు పెంచేందుకూ ఓకే

- బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సిందే!
- అవి ఇచ్చిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు
- ధాన్యం మిల్లింగ్ చార్జీలు పెంచేందుకూ ఓకే
- ఈ సిఫారసులతో ధాన్యం పాలసీ-24 సిద్ధం
- నేడు సీఎం రేవంత్‌కు అందజేత
- ఈ సారి రికార్డు స్థాయిలో కొనుగోళ్లు: మంత్రి ఉత్తమ్



2లో

వాయిస్ టుడే
హైదరాబాద్
గురువారం, 24 అక్టోబర్, 2024

## భయపెట్టాలని చూస్తే భయపడతామా?

**హైదరాబాద్, అక్టోబరు 23:** "నాకు లీగల్ నోటీసులు ఇచ్చి భయపెట్టాలని చూస్తే భయపడేది లేదు, రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తుంది. ఈ తాటాకు చప్పుళ్లకు భయపడను" అని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్.. తనకు లీగల్ నోటీసులు పంపడంపై సంజయ్ స్పందించారు. తనకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారన్న విషయాన్ని మీడియాలో చూసి తెలుసుకున్నానని తెలిపారు. మొదటగా కేటీఆరే తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో పాటు అవమానించారని, అందుకు బదులుగానే తాను మాట్లాడానని పేర్కొన్నారు.. ఇప్పటివరకు మాటలకు.. మాటలతోనే బదులిచ్చానని, ఇకపై లీగల్ నోటీసులకు.. నోటీసులతోనే బదులిస్తానని పేర్కొన్నారు. తాము చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులమని, చట్టం, న్యాయం ప్రకారమే ముందుకువెళ్తామన్నారు. కేటీఆర్ ఏమైనా సుద్దపూస అనుకుంటున్నాడేమోనని, కానీ ఆయన భాగోతం ప్రజలకు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసంటూ బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాగా బీఆర్ఎస్ నేతల లీగల్ నోటీసులకు, తాటాకు చప్పుళ్లకు బీజేపీ నాయకులు భయపడరంటూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్.. కేంద్ర హెూం శాఖ సహాయమంత్రికి లీగల్ నోటీసులు పంపడంపై ఆమె స్పందించారు. కేటీఆర్ లీగల్ నోటీసులను ఖండిస్తున్నట్టు బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధికారం నుంచి దిగిపొమ్మని ఇప్పటికే తీర్పు ఇచ్చారని, అయినా ఇంకా అధికారంలో ఉన్నారనుకుని ప్రతిపక్ష నాయకులకు నోటీసులు ఇస్తున్నారని అన్నారు. తాము తలుచుకుంటే భవిష్యత్తు మొత్తం నోటీసులు చదువుకోవడానికే సరిపోతుందంటూ హెచ్చరించారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ అనేకసార్లు ఇతర పార్టీల నాయకులపై ఇష్టారీతిన మాట్లాడారని, వారు మాట్లాడినా, ఆరోపణలు చేసినా రాజకీయం.. అదే బీజేపీ నాయకులు మాట్లాడితే పరువుకు భంగం కలుగుతుందా? అని నిలదీశారు. ఇప్పటికైనా నోరు అదుపులోపెట్టుకోవాలని కేటీఆర్‌కు సూచించారు. ఈ సందర్భంగా గతంలో ఒక సభలో కేసీఆర్ మహిళలను కుక్కలు అంటూ దురహంకారంతో మాట్లాడారని రుద్రమ గుర్తుచేశారు.

## నేనూ నోటీసులతోనే బదులిస్తా

**హైదరాబాద్, అక్టోబర్ 23:** కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై చేసిన నిరాధార వ్యాఖ్యల కారణంగా తన పరువుకు భంగం కలిగిందంటూ ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు లీగల్ నోటీసులు పంపారు. వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నెల 19న బండి సంజయ్ మీడియా సమావేశంలో తనపై తప్పు డు ఆరోపణలు చేశారని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరును కూడా ప్రస్తావించారని, ఆయన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని పేర్కొన్నారు. తనను అప్రతిష్ఠపాలు చేయాలన్న దురుద్దేశంతోనే బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని, వాటిని నిరూపించాలని సవాల్ చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలు విస్తృతంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం అయ్యాయని ఈ నేపథ్యంలో ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకొని ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలు ఉద్దేశపూర్వకంగా కల్పించిన కట్టుకథలుగా కేటీఆర్ కొట్టిపారేశారు. బురద చల్లడమే బండి ఉద్దేశం కేంద్రమంత్రి పదవిలో ఉన్న బండి సంజయ్ లాంటి వ్యక్తి చేసే ఆరోపణలు ప్రజాబాహుళ్యంలోకి విస్తృతంగా ప్రచారం అవుతాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై బురద చల్లాలనే దురుద్దేశంతో ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, తొమ్మిదేండ్లు రాష్ట్ర మంత్రిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. గతంలోనూ బండి తనపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారని, రాజకీయంగా తనను ఎదురొనే శక్తిలేక వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే కుట్ర తప్పవారి ఆరోపణల్లో నిజం లేదని స్పష్టంచేశారు.

## పరువు నష్టం కేసులో కొండా సురేఖ రిప్లై

**హైదరాబాద్, అక్టోబర్ 23:** మంత్రి కొండా సురేఖపై ప్రముఖ సినీనటుడు నాగార్జున వేసిన పరువునష్టం దావాపై నాంపల్లి స్పెషల్ కోర్టులో విచారణ కొనసాగింది. మంత్రి కొండా సురేఖ తరపున అడ్వకేట్ గుర్మీత్ సింగ్ రిప్లై ఫైల్ చేశారు. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 30కి వాయిదా వేసింది. సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబాన్ని, వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో నాగార్జున ఆమెపై పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరో వైపు సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసు విషయమై నాంపల్లి న్యాయస్థానం ముందు ఆయన హాజరు కానున్నారు. ఆయన స్టేట్‌మెంట్ ఇవ్వనున్నారు. మేజిస్ట్రేట్ రికార్డ్ చేయనున్నారు.

## ఐఏఎస్ ఆఫీసర్ అమోయ్ కుమార్‌ను సుదీర్ఘంగా విచారించిన ఈడీ

**హైదరాబాద్, అక్టోబరు 23:** మాజీ కలెక్టర్, ప్రస్తుత పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శి అమోయ్ కుమార్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్న అమోయ్‌ని సాయంత్రం వరకు ఈడీ ప్రత్యేక బృందం ప్రశ్నించింది. సమన్లలో పేర్కొన్న విధంగా పలు పత్రాలను అమోయ్ వెంట తీసుకెళ్లగా... ఈడీ అధికారులు వాటిని పరిశీలించినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా అమోయ్ పని చేసినప్పుడు మహేశ్వరం మండలం నాగారంలో వందల కోట్ల రూపాయల విలువైన భూదాన్ భూముల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన అంశంపైనే ఈడీ అధికారులు ప్రధానంగా ప్రశ్నించినట్లు తెలిసింది. నాగారంలో 42 ఎకరాల ప్రభుత్వ భూమిని మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి, మరికొందరు అధికారులు కలిసి ప్రైవేటు సంస్థకు అప్పగించగా.. ఈ విషయమై స్థానికులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జ్యోతితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై గతంలోనే విజిలెన్స్ విభాగం విచారణ జరిపింది. పోలీసు కేసు, విజిలెన్స్ విచారణ ఆధారంగా ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను ఈడీ బృందం ప్రశ్నించినట్లు తెలిసింది. అమోయ్ కుమార్ కలెక్టర్‌గా ఉన్న సమయంలోనే శేరిలింగంపల్లి, నానక్‌రాంగూడ భూములకు సంబంధించి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటి విషయంలోనూ ఈడీ అధికారులు ఆరా తీశారు. అమోయ్ కుమార్‌ను 7 గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన ఈడీ.. గురువారం మరో సారి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. విచారణ అనంతరం తిరిగి వెళ్లే సమయంలో మీడియాతో మాట్లాడేందుకు అమోయ్ కుమార్ నిరాకరించారు.

**నాయకుల మెడకు ఈడీ ఉచ్చు:** మహేశ్వరం పరిధిలోని భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే క్రమంలో భూములకు సంబంధించి జరిగిన వందల కోట్ల లావాదేవీల్లో అప్పటి ప్రభుత్వంలో కీలక నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలున్నాయి. ఇద్దరు మంత్రులతోపాటు వారి కుటుంబ సభ్యులకు పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టాయని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా మహేశ్వరం భూముల విషయంలో విచారణ జరుపుతున్న ఈడీ మరింత లోతుగా ముందుకెళ్తే గత ప్రభుత్వ నాయకుల ప్రమేయం కూడా బయటపడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

# ఇంచియాన్ స్మార్ట్ సిటీ తరహాలో..

(మొదటి పేజీ తరువాయి)
జరిగింది. అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఇంచియాన్‌లోనే ఉంది. దీంతో హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో నిర్మించబోతున్న ఫోర్త్‌సిటీలో కూడా ఇంచియాన్ నగరంలోని స్మార్ట్ విధానాలనే అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా హైదరాబాద్, జిల్లాల కేంద్రాల్లో కూడా అవసరమైన మేరకు ఈ స్మార్ట్ సేవలను తీసుకువచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

**శిక్షణ ఇచ్చేందుకు రావాలి..**

కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా రాష్ట్ర మంత్రుల బృందం సందర్శించింది. అక్కడి సౌకర్యాలను పరిశీలించింది. యూనివర్సిటీలో శిక్షణ పొందిన అనేకమంది క్రీడాకారులు ఒలింపిక్స్‌లో దక్షిణ కొరియాకు పతకాలు సాధించి పెట్టారు. కాగా, ఫోర్త్‌సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు శిక్షణ కోసం కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఎంవోయూ చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఆగస్టులో దక్షిణ కొరియా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ యూనివర్సిటీని సందర్శించారు. ఆయన కూడా ఇక్కడి అధికారులతో మాట్లాడారు. ఇప్పుడు మంత్రులు ఆ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఫోర్త్‌సిటీలో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలోని క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు రావాలని కోరారు. ఇందుకు అక్కడి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ సహకారానికి సంబంధించి త్వరలోనే అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి అంగీకారం కుదిరింది.

**ఫోర్త్ సిటీలో పెట్టుబడులకు కంపెనీలు సిద్ధం**

ఐటీ రంగంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉండే కాలుష్యర హిత కంపెనీలను స్మార్ట్ ఫోర్త్‌సిటీలో ఏర్పాటుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇంచియాన్ స్మార్ట్‌సిటీతో చూస్తే ఫోర్త్‌సిటీకి ఉన్న ప్రదేశం ఇంకా ఎక్కువ అని, భవిష్యత్తులో మరింత అద్భుతంగా అభివృద్ధి చేయవచ్చునని పేర్కొన్నారు. ఫార్మా రంగంలో కూడా కాలుష్య రహితమైనవే వస్తాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లోని పలు కంపెనీలు ఫోర్త్‌సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయన్నారు. కొరియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన ఒక అమ్మాయే ఒలింపిక్స్‌లో ఏకంగా మూడు బంగారు పతకాలు సాధించిందని తెలిపారు. ఇక్కడి నుంచి వచ్చే కోచ్‌లు ఇచ్చే శిక్షణతో యంగ్ ఇండియా యూనివర్సిటీలో మెరికల్లాంటి క్రీడాకారులను తయారుచేస్తామన్నారు. భారత్ తరఫున హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా చేసి... తెలంగాణ బిడ్డల్ని కూడా పతక విజేతలుగా చేస్తామని చెప్పారు.

**ప్రతిపక్ష నేతలవి అవాకులు, చవాకులు..**

ప్రధాన ప్రతిపక్ష నేతలు కొన్ని అవాకులు, చవాకులు పేలారని పొంగులేటి మండిపడ్డారు. ఒకరోజు పిల్లకాలువ అని, మరో పెద్ద కాలువ అని రకరకాలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సియోల్ నదులను ఎత్తుకొచ్చి తెలంగాణలో పెట్టమని, ఇక్కడ ఆ నదుల అభివృద్ధి కోసం అనుసరించిన విధానాలను అమలుచేస్తామని అన్నారు. దశాబ్దాలుగా మూసీలో మగ్గుతున్న వారికి మెరుగైన జీవితాలు ఇచ్చేలా, వారి పిల్లలకు ఉద్యోగ భవిష్యత్తు ఉండేలా విధానాలు రూపొందిస్తామన్నారు. మూసీని ప్రక్షాళన చేసే విషయంలో బాధితులను కష్టపెట్టబోమని స్పష్టం చేశారు. కాగా, బీజేపీ నేతలు మూసీ నదిని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పుబట్టారు. వాళ్లు అవకాశవాద రాజకీయాలు మానుకోవాలని, తెలంగాణ అభివృద్ధి కావాలనుకుంటే మూసీ విషయంలో సహకరించాలని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే విమర్శలు మాని.. సూచనలు ఇవ్వాలన్నారు.

## ధాన్యం మిల్లింగ్ చార్జీలు పెంచేందుకూ ఓకే

**హైదరాబాద్, అక్టోబరు 23:** గతంలో మాదిరిగా రైస్ మిల్లర్లకు అప్పనంగా ధాన్యం అప్పగించకుండా... బ్యాంకు గ్యారెంటీ తీసుకున్న తర్వాతే కేటాయించాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. నిర్ణీత ధాన్యం పరిమాణానికి అనుగుణంగా బ్యాంకుల్లో ఆస్తులు తాకట్టుపెట్టి.. బ్యాంకు గ్యారెంటీ పత్రాలు తీసుకొని, పౌరసరఫరాల సంస్థకు అప్పగించిన రైస్ మిల్లర్లకే ఇకపై ధాన్యం కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు ధాన్యం సేకరణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో ఏర్పాటైన ఉప సంఘం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అన్ని వర్గాలతో చర్చించి, ఇతర రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేసి ఖరీఫ్ ధాన్యం పాలసీ-2024ని రూపొందించింది. సంబంధిత నివేదికను గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయనుంది. ఈనెల 26 న జరగనున్న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఖరీఫ్ ధాన్యం పాలసీకి ఆమోద ముద్ర వేయనున్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో బుధవారం మంత్రి వర్గ ఉప సంఘం భేటీ అయింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి తదితరులు అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదనలను మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై తుది నివేదిక సిద్ధమైందని, గురువారం సీఎం రేవంత్‌కు అందజేస్తామని వెల్లడించారు. బ్యాంకు గ్యారెంటీలతోపాటు మిల్లింగ్ చార్జీల పెంపుపైనా కీలక సిఫారసులు చేసినట్లు తెలిపారు.

## ఆ మాటలు నా నోటితో నేను చెప్పలేను

**హైదరాబాద్/నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 23:** ఇన్నేండ్లు ప్రజాజీవితంలో ఉంటూ కాపాడుకున్న తన పరువు ప్రతిష్ఠలు దెబ్బతీసేలా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి అత్యంత దిగజారుడు వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కొండా సురేఖపై దాఖలుచేసిన పరువునష్టం దావాలో కేటీఆర్ బుధవారం ప్రజాప్రతినిధుల కోర్టులో తన వాంగ్మూలం ఇచ్చారు. సుమారు అర్ధగంటపాటు కేటీఆర్ వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసుకున్నది. మంత్రి మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా ఉన్నాయని కేటీఆర్ అన్నారు. వ్యక్తిగతంగా తనకు, పార్టీ ప్రతిష్ఠకు గండికొట్టాలనే ఉద్దేశంతో అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఆమె తనపై, సాటి మహిళ సమంత మీద ఎలాంటి జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిందో.. తన నోటితో కోర్టులో చెప్పలేనని అన్నారు. బహిరంగంగా (ఓపెన్ కోర్టులో) అసభ్య పదజాలాన్ని చదవడం మంచిదికాదని, ఆమె చేసిన వ్యాఖ్యలను పిటిషన్‌లో పేర్కొన్నట్టు విన్నవించారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు శాసన సభ్యుడిగా ఎన్నుకోబడి, ప్రజలకు సేవలందిస్తునట్టు తెలిపారు. తాను ఉన్నత విద్యావంతుడినని, అమెరికాలో, భారత్‌లో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగం చేశానని చెప్పారు. 2006లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున్న సాగుతున్న సమయంలో నెలకు రూ.4 లక్షల వేతనం సంపాదిస్తున్నప్పటికీ ఉద్యోగానికి రాజీనామాచేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు.



**రాష్ట్ర ప్రజల ప్రశంసలు పొందా..**

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించానని, ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి విశేష సేవలందించడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తనకు అవార్డులు లభించాయని కేటీఆర్ తెలిపారు. 18 సంవత్సరాలపాటు ప్రజలతో మమేకమై మచ్చలేకుండా రాష్ట్ర ప్రజల ప్రశంసలు పొందానని చెప్పారు. తాను అందించిన సేవలకు గుర్తింపుగా మీడియా సంస్థలు సైతం 'యంగ్ పొలిటీషియన్' అవార్డుతో సత్కరించాయని వెల్లడించారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా ప్రజల మధ్య తనకు మంచి పేరు, ప్రతిష్ఠలున్నాయని వివరించారు.

**కావాలని నిరాధార ఆరోపణలు**

మంత్రి కొండా సురేఖ మీడియా సమావేశంలో కావాలని తనపై నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్ చెప్పారు. ఆ వ్యాఖ్యలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీడియాలో ప్రసారం అయ్యాయని, ఆ వార్తా కథనాల ద్వారా సాక్షులుగా ఉన్నవారు తీవ్ర కలత చెందారని తెలి పారు. ఈ కేసులో సాక్షులుగా ఉన్నవారితో 18 సంవత్స రాలుగా తనకు పరిచయం ఉన్నదని, తన గురించి, గౌరవ మర్యాదల గురించి వారికి తెలుసు అని పేర్కొన్నారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వల్ల తన పరువుకు భంగం వాటిల్లిందని అన్నారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఏమిటి? వాటి గురించి వివరాలు చెప్పగలరా? అని జడ్జి ప్రశ్నించారు. మహిళల పట్ల తనకెంతో గౌరవం ఉన్నదని, కొండా సురేఖ సాటి మహిళ సమంతతోపాటు తనపై చేసిన అతినీచమైన, జుగుప్సాకరమైన వ్యాఖ్యలను పవిత్రమైన కోర్టులో తన నోటితో చెప్పలేనని అన్నారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఉద్దేశపూర్వకంగా నిందలు వేశారని, ఈ దుశ్చర్యలను తీవ్రంగా పరిగణించి చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు.

## ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలతాయి!

**హైదరాబాద్, అక్టోబర్ 23:** ప్రధాన నేతలకు పెద్ద షాక్ ఇవ్వబోతున్నట్లు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి వంటి సుమారు 8 నుంచి 10 ప్రధాన అంశాల్లో చర్యలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని సాక్ష్యాధారాలతో ఫైళ్లు కూడా సిద్ధం చేశామని తెలిపారు. సియోల్ నుంచి హైదరాబాద్ చేరేలోపే ఈ చర్యలు ప్రారంభమవుతాయన్నారు. ఇది కక్ష్యసాధింపు కాదని.. పూర్తి ఆధారాలతో సర్కారు చర్యలు తీసుకోబోతోందని స్పష్టం చేశారు. తప్పు చేసింది ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విచారణ దాదాపు పూర్తయిందని, మొత్తానికి ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి అంశాలు ట్రాక్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఎలాంటి చర్యలు లేవని ప్రజలు భావించవద్దని, వారు కోరుకునే విధంగా పూర్తి ఆధారాలతో ముందుకు రాబోతున్నామని వెల్లడించారు.

**అన్ని భూ సమస్యలకు చెక్ పెట్టేలా..**

భూహక్కులపై సామాన్య రైతుల నుంచి భూస్వాముల వరకు ఎవరికి అపోహలకు తావు లేకుండా అన్ని సమస్యలకు చెక్‌పెట్టేలా కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తెస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కొత్త ఆర్వోఆర్ చట్టం ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. అభద్రతలో ఉన్న లక్షలాది మంది రైతులకు ఇందిరమ్మ ప్రభుత్వం భరోసా కల్పించబోతోందని స్పష్టం చేశారు. 15 దేశాల్లో అమల్లో ఉన్న ఉత్తమ రెవెన్యూ విధానాలను అధ్యయనం చేసి కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని రూపొందించామన్నారు. అంతేకాకుండా ముసాయిదాపై సామాన్య రైతులు, మేధావుల నుంచి అభిప్రాయాలు సేకరించి వారి సూచనలు, సలహాలను క్రోడీకరించి చట్టంలో పొందుపర్చామని వెల్లడించారు. ధరణి లోపాల వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. లక్షలాది ఎకరాల భూరికార్డులను విదేశీ సంస్థల చేతిలో పెట్టిన కేసీఆర్.. పోర్టల్ నిర్వహణ పేరుతో రూ.కోట్ల ఖర్చు చేశారని ఆరోపించారు. పార్ట్-బీలో ఉన్న 13 లక్షల ఎకరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడంతోపాటు ధరణిలో కనిపించకుండా ఉన్న భూములను బయటపెట్టి అర్హులకు, హక్కుదారులకు దక్కేలా చూస్తామని చెప్పారు. గతంలో మాన్యువల్‌గా ఉన్న పహాణీలో 32 కాలాలు ఉండేవని అవన్నీ గత ప్రభుత్వం తొలగించి ధరణి ముసుగులో ఒకే కాలం పెట్టి గందరగోళ పరిస్థితిని సృష్టించిందన్నారు. ఇదే కాలంలో మార్పులు చేసి సుమారు 14 కాలాలు ఉండేలా ధరణి పేరు మార్చి కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తేబోతున్నామన్నారు. ప్రతి రైతుకు క్లియర్ టైటిల్‌తో డాక్యుమెంట్ ఉండబోతోందని వివరించారు.

## 'గో బ్యాక్ అంబుజా'..

(మొదటి పేజీ తరువాయి)
ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వెళ్లిపోవాలని స్థానికులు నినాదాలు చేయడంతో వారు తిరుగుముఖం పట్టారు. సదస్సు ముగిశాక అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.బెన్‌షాలోంను ప్రజలు అడ్డుకున్నారు. ఫ్యాక్టరీని నెలకొల్పబోమని ఇప్పుడే ప్రకటించాలని పట్టుబట్టారు. వారిని పోలీసులు అడ్డుకుని.. అదనపు కలెక్టర్‌ను వాహనం ఎక్కించారు. ఆ వాహనాన్ని ప్రజలు వెంబడిస్తూ 'అంబుజా గో బ్యాక్' అని నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రజల అంగీకారం లేకుండా పరిశ్రమను ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. సదస్సుకు బయలుదేరిన మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిషోర్ కుమార్, నోముల భగత్‌ను వేర్వేరుచోట్ల పోలీసులు అడ్డుకున్నారు. వీరిలో కొందర్ని గృహ నిర్బంధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏం ఆశించి రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చిందని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## మోదీకి బీ-టీమ్‌గా.. రాష్ట్ర కాంగ్రెస్

### అందుకే అదానీ అంబుజాకు సహకారం

### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపణ

**హైదరాబాద్, అక్టోబరు 23:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ.. మోదీకి బీ-టీమ్‌గా పనిచేస్తోందని అందుకే రామన్నపేటలో అదానీ ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సహకరిస్తున్నారని మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సిమెంట్ ఫ్యాక్టరీ వస్తే రామన్నపేట మండలం కకావికలం అవుతుందని, దాన్ని అడ్డుకుంటామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల మధ్య కాకుండా దొంగచాటుగా జరపాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ అభిప్రాయాలు చెప్పడానికి వెళ్తున్న బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేశారన్నారు. రేవంత్‌రెడ్డి పరిపాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలపై కోదండ రామ్, హరగోపాల్ ఇప్పటికైనా గొంతు విప్పాలని డిమాండ్ చేశారు.

## సీఐపై పోక్సో కేసు.. ఖాకీ చొక్కాతో నీచ పనులు

(మొదటి పేజీ తరువాయి)
సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ హనుమకొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. తాను నివాసం ఉండే ప్రాంతానికి చెందిన ఓ బాలికపై కన్నేశాడు. ఈ నెల 9వ తేదీన సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికొచ్చిన సదరు బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశచూపి ఇంట్లోకి పిలుచుకున్నట్లు, స్కూల్ విషయాలు అడుగుతూ ఆమె శరీరాన్ని అభ్యంతకరరీతిలో తాకుతూ ప్రవర్తించినట్లు సమాచారం. అప్పటికే ఆ బాలిక.. తాను ఇంటి వెళ్లాలి అంకుల్ అంటూ విడిపించుకునేందుకు ప్రయత్నించినా విచక్షణ మరిచిన ఆ పోలీసు ఆ బాలికపై అత్యాచారయత్నం చేశాడు. అతడి నుంచి ఆ బాలిక ఎలాగోలా తప్పించుకుని ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. నిందితుడు పోలీస్ అధికారి కావటంతో వారు ఫిర్యాదు చేసేందుకు కొంత వెనుకడుగు వేశారు. ఎట్టకేలకు మిత్రుల సలహాతో ఆ తల్లిదండ్రులు మంగళవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు అక్కడ సీఐ రవికుమార్‌పై పోక్సో చట్టం 2012 కింద కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పోలీసులు (సీఆర్ నెం.264/2024) కేసు నమోదైనప్పటికి బయటకు పొక్కకుండా స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రయత్నాలు చేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి మీడియా ప్రతినిధులు ఎస్‌హెచ్‌వోను సమాచారం అడగ్గా.. మూడు రోజులుగా అనారోగ్యం వల్ల డ్యూటీలో లేనని చెప్పాడని, అతడితో పాటు కేసు నమోదు చేసిన ఎస్ఐ, మరో ఎస్ఐ కూడా ఫోన్లు ఎత్తకుండా సమాచారాన్ని దాటవేసే ప్రయత్నాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.